

## శ్రీవారి సేవలో ప్రముఖులు



**ప్రజాశక్తి- తిరుమల:** తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆదివారం వీఐపీ ప్రారంభ విరామదర్శన సమయంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాల కష్ణరావు, రాష్ట్ర మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, టిడిపి ఎమ్మెల్సీలు దీపక్ రెడ్డి , బీద రవిచంద్రలు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శనఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.

## క్రాఫ్ట్ బజారు ప్రారంభం



**ప్రజాశక్తి- తిరుపతి సిటి :** జిల్లా హ్యాండీక్రాఫ్ట్స్ ప్రోడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ శ్రీకాళహస్తి వారి ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్‌బజారును టిటిడి పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్ ప్రారంభించారు. స్థానిక ఖాధీకాలనీలోని శివ శక్తి కల్యాణమండపం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన క్రాఫ్ట్‌బజారు ప్రారంభోత్సవం లో ఆయన మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి ప్రపంచదేశాలకు ఆదర్శనీయమని అన్నారు. వాటిని కళల రూపంలో, చేనేత వస్త్రాల రూ పంలో మన ముందుకు తెస్తున్న కళంకారీలు, చేనేతవృత్తి కళాకారులను ఆయన అబినం దించారు. చేనేతవస్త్రాలను, కళాకారులను, ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆ సంస్థ ఎండి గుమ్మిడిపూడి దశరథాచారి మాట్లాడుతూ ఈనెల 26వ నుంచి మార్చి 6వ తేది వరకు ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని అన్నారు. ఇందులో చిత్తూరు జిల్లాలోని కొయ్య బొమ్మలు, కడప జిల్లాలోని రాజారాణి బొమ్మలు, కలంకారీ, కొయ్యలెక్క పిడతలు, పోచంపల్లి, మంగళగిరి, వెంకట గిరి, చీరాల శారీలు, డ్రస్ మెటీరియల్స్, దుప్పట్లు, టవళ్లు, గృహోపకరణ వస్తువులు, సువాసన ఇచ్చే రకరకాల ఆగరబత్తులు, దూప పు స్టిక్‌లు, కాటన్, ఖద్దరు షర్టులు, ప్యాంట్లు, చెక్క బొమ్మలు, కొండపల్లి బొమ్మలు, ఏటి కొప్పాక చెక్కబొమ్మలు, తదితర వాటిని అందుబాటులో ఉంచామని, వీటిని నగర వాసవులతో పాటు, పరిసరాల ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హస్తకళల సేవావిస్తార కేంద్రం ఏడి టి.సత్యమూర్తి, ఎస్వియు పాలమండలి సభ్యులు మల్లారపు మధు, రాజేష్ నాయక్, పలువురు ప్రముఖులు, కలంకారీ, చేనేత కళాకారులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాలతో...

# విద్యా వ్యవస్థ నిర్వీర్యం

● ఐక్య పోరాటాలకు సిద్ధం కండి ● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విఠపు పిలుపు ● శ్రీకాళహస్తిలో ఘనంగా యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సభలు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

**ప్రజాశక్తి- శ్రీకాళహస్తి :** ప్రపంచ బ్యాంకుకు తలొగ్గి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నూతన విద్యావిధానాల వల్ల ఉపాధ్యాయ, విద్యారంగం ప్రమాదంలో పడిందని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. ఈ నూతన విద్యా సంస్కరణలను ప్రతిఘటించకుంటే ఉపాధ్యాయులు కట్టు కట్టుబానిసల్లాగా మారే అవకాశం ఉందనీ, 2026 నాటికి ఎస్జీటీలు కనుమరుగైనా ఆశ్చర్యపోనక్కర్లేదని హెచ్చరించారు. పట్టణంలోని స్థానిక ఎస్-ఎస్ కన్వెన్షన్ హాలులో ఆదివారం యుటిఎఫ్ తిరుపతి జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం యూటీఎఫ్ పతాకావిష్కరణ అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కౌన్సిల్ సమావేశాలను ప్రారంభించారు. ఈ సమావేశాలనుద్దేశించి ఎమ్మెల్సీ విఠపు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో ఇటీవల కాలంలో తీవ్రమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. ప్రపంచ బ్యాంకుకు తలొగ్గి కేంద్రం, కేంద్రానికి తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద నూతన విద్యాసంస్కరణలను అమలు చేస్తోందని తెలిపారు. ఫలితంగా ప్రాథమిక విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. 3,4,5 తరగతుల విలీనం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పది లోపు విద్యార్థులే ఉన్న 2వేలకు పైగా ప్రాథమిక పాఠశాలున్నాయనీ, వీటన్నిటినీ త్వరలో మూసివేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని వాపోయారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 4వేల స్కూళ్లకు మాత్రమే మ్యాపింగ్ చేసిందనీ, తద్వారా 26వేల ఉపాధ్యాయ పోస్టులను కోల్పోయే ప్రమాదం వచ్చిందని వివరించారు. జగన్ ఇంగ్లీష్ మీడియం, బైజుస్ అంటూ ప్రాథమిక విద్యా వ్యవస్థను గాలికొదిలేశాడని ధ్వజమెత్తారు. అన్ క్వాలిఫైడ్ టీచర్లతో ప్రాథమిక విద్యావ్యవస్థను నెట్టుకురావడం జగన్ ఉద్దేశమని అన్నారు. విద్యావ్యవస్థ చరిత్రలో ఉపాధ్యాయ పోస్టులు పెరుగుతూ వచ్చాయే తప్ప తరగడం ఎన్నడూ చూడలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ వర్గాన్ని శత్రు వర్గంగా చూస్తోందనీ, అందుకే వారిపై కక్షగట్టి బోధనేతర పనులను అప్పజెప్పుతోందంటూ మండిపడ్డారు. ప్రత్యామ్నాయ విద్యావిధానాల అమలులో ఏపీ తమిళనాడు రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నూతన విద్యావిధానాలను తిరస్కరించడమే కాకుండా ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని అమలు చేస్తే తీరుతామంటూ కేంద్రానికి స్పష్టం చేయడం అనుసరణీయమని అన్నారు. ఆ తరహా ప్రత్యామ్నాయ విద్యావిధానాల వైపు ఏపీ అడుగేయకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంకు విద్యావిధానాలను అనుసరిస్తూ పోతే చివరకు ప్రభుత్వ బడుల్లో రెగ్యులర్ టీచర్లే ఉండరనీ, ఒప్పంద ఉపాధ్యాయులను పెట్టి వెట్టిచాకిరి చేయించుకోవడం తధ్యమన్నారు. ఇకనైనా ఉపాధ్యాయులు ఐక్యంగా ఉండి వారి హక్కులను సాధించుకోవడమే కాకుండా, మెరుగైన విద్యావ్యవస్థ నిర్మాణానికి కారణభూతులు కావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుటిఎఫ్ అంటే ఒక నిజం అని చాటిచెప్పేలా కార్యకర్తలు పనిచేయాలని అన్నారు. సూర్య కేంద్రసిద్ధాంతాన్ని ప్రపంచానికి తెలియజేసిన శాస్త్రవేత్త లినార్డ్ బ్రూనోను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులకు సీఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకూ, బకాయిలు చెల్లించే వరకూ, ఏటా డీఎస్సీ నోటిఫికేషన్, ఉపాధ్యాయ ఖాళీలను పూరించే వరకు యూటీఎఫ్ కార్యకర్తల పోరాటం ఆగకూడదని స్పష్టం చేశారు. పిడిఎఫ్ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబిరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, ప్రధానకార్యదర్శి ముత్యాలరెడ్డి, నాయకులు జి.శ్రీనివాసులు, సూర్యప్రకాష్, జయంతి, సునీల, వెంకటకష్ణ, విజయ్ కుమార్, రాజేష్, దామోదర శెట్టి, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**ఉద్యమ గొంతుకను గెలిపించండి: పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పొక్కిరెడ్డి, మీగడ**



రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్మిక, కర్షక, నిరు ద్యోగ, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల గొంతుకై నిలిచే పిడిఎఫ్ ఉద్యమ అభ్యర్థులను గెలిపించాలని పొక్కిరెడ్డి బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి ఆదివారం వారిరువురు మీడియాతో మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. సిపిఎస్ రద్దు, ఓపిఎస్ అమలుకు పిడిఎఫ్ అభ్యర్థులు శక్తి వంచన లేకుండా కషి చేస్తారని చెప్పారు. నూతన విద్యావిధానం పేరుతో పాఠశాలల కుదింపు, పోస్టుల తగ్గింపుపై విస్తత ఉద్యమం చేపడతామన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులకు, సిబ్బందికి గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులు, సంక్షేమ నిధిని ఏర్పాటు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వంటి వెట్టిచాకిరీ విధానాల రద్దుకు పోరాటం చేస్తామన్నారు. ఉపాధ్యాయులు పట్టభద్రులు వారి మొదటి ప్రాధాన్యతా ఓటును పిడిఎఫ్ అభ్యర్థులకే వేసి గెలిపించాలని కోరారు.

**యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా బండి మధుసూదన రెడ్డి ఎంపిక**

**తిరుపతి టౌన్:** తిరుపతి జిల్లా యుటిఎఫ్ ప్రథమ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం శ్రీకాళహస్తిలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్లు జరిగాయి. ఎన్నికల అధికారిగా రాష్ట్రకార్యదర్శి లక్ష్మీరాజా నిర్వహించారు. ఎన్నికల కార్యక్రమంలో తిరుపతి అర్బన్ సంబంధించి జిల్లా కార్యదర్శిగా బండి మధుసూదన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## పిడిఎఫ్ ఎమ్మెల్సీఅభ్యర్థులను గెలిపించండి

వామపక్ష నేతలు పిలుపు

**ప్రజాశక్తి- తిరుపతిటౌన్, తిరుపతి సిటి:** ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్ట భద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులైన మీగడ వెంకటేశ్వర్ రెడ్డి, బాబు రెడ్డిలను గెలిపించా లని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం బైరాగి పట్టెడలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ, సిపిఎం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి, సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం మాట్లాడుతూ ఉద్యోగుల, కార్మికుల, కష్టజీవుల సమస్యలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు నిరంతరం పోరాడారని అన్నారు. గతంలో మూడుసార్లు పిడి ఎఫ్ అభ్యర్థులను పట్టభద్రులు, ఉద్యోగులు, కార్మిక సంఘా లు, మేధావులు గెలిపించారని అన్నారు. మార్చి 13వ తేదీ జరుగుతున్న ఎన్నికలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జచచంద్ర, సాయి లక్ష్మి, సిపిఐ నగర కార్యదర్శి జె విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకష్ణ, ఎన్.డి.రవి, నదియా, మంజుల, రామకష్ణ, రామచంద్రయ్య, ఉదయ్, శివారెడ్డి చలపతి, కాలయ్య, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మీగడ వెంకటేశ్వరరెడ్డి, బాబురెడ్డిలను గెలిపిద్దాం..!

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు

**ప్రజాశక్తి -గూడూరు :** పిడిఎఫ్ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డిలను గెలిపించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు కోరారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ప్రజాసంఘాలతో జనరల్‌బాడీ సమావేశం ఏ.మంజులమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పిడిఎఫ్ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబిరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డిలను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను సమీకరించడం, దొంగ ఓట్లను అరికట్టాలన్నారు. అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించే వారి పై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అంగన్వాడీ అధ్యక్షురాలు పద్మలీల, తిరుపతి జిల్లా శ్రామిక మహిళా నాయకురాలు ఆర్.లక్ష్మి, చిల్లకూరు ఇందిరమ్మ, బాలాయపల్లి స్వరూపారాణి, గూడూరు ప్రభావతి, వాకాడు సరోజినీ, సిఐటియు నాయకులు జోగి శివకుమార్, అడపాల ప్రసాద్, ఎస్.సురేష్, ఎస్.ముత్యాలయ్య, బివి.రమణయ్య, బి.చంద్రయ్య, పి.మణి. తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకురాలు ఆర్.లక్ష్మీ

## అక్రమ రవాణాలో ఎంతటివారున్నా ఉపేక్షించేది లేదు

చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం : తిరుపతి ఎస్పి పరమేశ్వరరెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పి పరమేశ్వరరెడ్డి

**ప్రజాశక్తి- తిరుపతి సిటీ:** ఎర్రచందనం అక్రమ రవాణాలో ఎంతటి వారున్న ఉపేక్షించే ప్రసక్తే లేదని, చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తిరుపతి ఎస్పి పరమేశ్వరరెడ్డి హెచ్చరించారు. ముగ్గురు అంతరాష్ట్ర ఎర్రచందనం ముద్దాయిలను అదుపులోకి తీసుకున్న సంఘటనపై ఆదివారం ఆయన విలేకరులకు వివరించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపి, విస్తృతంగా పోలీసులు దాడులు నిర్వహిస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో ఎర్రవారిపాళెం పోలీసులు ఈ నెల 25వ తేదీ సాయంత్రం వారికి అందిన సమాచారం మేరకు యల్లమంద పంచాయతీ ఉస్తికాలయ పెంటరోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో అనుమానస్పదంగా ఉన్న ఒక కారు, ఒక మోటారు సైకిల్‌ను వెంబడించారు. అందులోని వ్యక్తులు పోలీసులను చూపి పారిపోయేందుకు ప్రయత్నించి, పట్టుకున్న పోలీసులను గాయపరిచారు. ఈ ఘటనలో ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డుకు గాయాలయ్యాయి. అప్రమత్తమైన సిఐ, ఎస్ఐ మిగిలిన సిబ్బందిని వారిలో ముగ్గర్ని చాకచాక్యంగా పట్టుకున్నారు. ఒకరు పారిపోయారు. వారి వద్దనుంచి రూ.21,94,000లు విలువ చేసే 13 ఎర్రచందనం దుంగలు, కారు, పల్సర్ మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. పారిపోయిన వ్యక్తి సత్యరాజ్ రాజేంద్రన్ ప్రధాన నిందితుడని, ఇతను కూలీలను ఎర్రచందనం నరికేందుకు శేషాచల అడువులకు తీసుకొస్తాడని విచారణలో వెల్లడైందన్నారు. పట్టుపడిన ముగ్గురు ముద్దాయిలు తమిళనాడుకు చెందిన వారని, వారిలో తిరువణ్ణామలైకు చెందిన కె.రవికుమార్, కె.సుధాకర్, వేలూరుకు చెందిన ఎ.మునివేలు ఉన్నారన్నారు. వారిపై కేసు నమోదు చేసి, రిమాండుకు తరలించామని తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణాను కట్టడి చేయడానికి ప్రత్యేకమైన నిఘా వ్యవస్థను, బంధాన్ని ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని సమాచారం కోసం ఇతర రాష్ట్రాల్లో కూడా నిఘా ఉంచామని, శేషాచలం సంపదను కాపాడుకోవడం మన విధి అన్నారు. అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. డిఎస్‌పిలు, సిఐ తులసిరామ్, ఎస్ఐలు ప్రకాష్‌కుమార్, వెంకటేశ్వర్లు, సిబ్బంది అనిల్‌కుమార్, రవికుమార్, ప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, ఎం.బాలసుబ్రమణ్యం, చంద్రశేఖర్, పి.బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన గంధోత్సవం




**ప్రజాశక్తి- తిరుపతిటౌన్:** స్థానిక ఎస్వీఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న ఖాదరీపీఠం వద్ద 77వ గంధోత్సవం కార్యక్రమం రెండురోజులు వైభవంగా నిర్వహించి, ముగించడం జరిగింది. నాల్గోవ పీఠధిపతి సయ్యద్‌షఫీ అహ్మద్‌ఖాదరీ (ప్రభుత్వఖాజీ) ఆధ్వర్యంలో ఫకీర్లజరబులు విన్యాసాలు నిర్వహించారు. తరువాత వెయ్యిమంది పేదలకు అన్నదానం కార్యక్రమం చేశారు. గంధోత్సవం ముఖ్య అతిధిగా ఎంఎల్ఏ బి.కరుణాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తిశ్రద్దలతో కలిసిమెలసి ఉండాలని దర్గకు వచ్చిన భక్తులకు తెలిపారు. పీఠాదిపతి సయ్యద్ షఫీఖాదరీ మాట్లాడుతూ మానవత్వమే మతముకన్న గొప్పదని అన్నారు. ఉర్దూ కవి సమ్మేలన నిర్వహించారు. ఈకార్యక్రమంలో సయ్యద్ ఆయుబ్ ఖాదరీ, సయ్యద్ తకిఖాదరీ, షేక్ మీర్జాసాహెబ్, సయ్యద్ ఆరిపుల్లా, సయ్యద్ ఉస్మాన్, ఖాదరీ, టిపుఖాదరీ, జుబేర్‌ఖాదరీ, ఎంవిఎస్.మణి, ఆర్ వెంకటేశ్వర్లు, ఆదికేశవులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా స్విమ్స్ 30వ వ్యవస్థాపక దినోత్సవం




**ప్రజాశక్తి- తిరుపతి సిటీ:** శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) 30వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్విమ్స్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఆదివారం మహతి ఆడిటోరియంలో స్విమ్స్ 30వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా నేషనల్ మెడికల్ కమిషన్ ఎండి డాక్టర్ బిఎన్.గంగాధర్, టిటిడి ఈఓ ఏవీ. ధర్మారెడ్డి, టిటిడి జెఈవో సదా భార్గవి, స్విమ్స్ ఉపకులపతి డాక్టర్ బి.వెంగమ్మ, డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీధర్‌బాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వనజాక్షమ్మ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌లు జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటగా ఆకాంక్ష - 2023, వార్షిక నివేదక -2022 సిడిలను జరనల్ ఆఫ్ క్లినికల్ అండ్ సైంటిఫిక్ రిసెర్చ్ - 2022-23 పుస్తకాలను ఆవిష్కరించారు. డాక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ 1993 ఫిబ్రవరి 26న నిర్దేసిత కార్యకలాపాలను ప్రారంభించి నేటికి 30 వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుందన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన కుటుంబాలకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం అమలులో స్విమ్స్ ముందు వరుసలో ఉందని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కిందికి రాని జబ్బులకు టిటిడి అమలు చేస్తున్న ప్రాణదాన పథకం ద్వారా 2022 డిసెంబర్ వరకు 23,627మంది పేదరోగులకు ఉచిత వైద్యసేవలు అందించడం జరిగిందని అన్నారు. అందు కోసం టిటిడి ప్రాణదానం ట్రస్ట్ నిధులను రూ.130.8 కోట్లు టిటిడి సమకూర్చింది. ప్రాణదాన పథకం ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిందని, వైద్యసేవల పరంగానే కాక స్విమ్స్ వైద్య విద్యాబోధనల పరంగా తనకంటూ ఒక గుర్తింపు సాధించిందని అన్నారు. శ్రీపద్మావతి ఓపిడి బ్లాక్ 3వ అంతస్థులో గ్యాస్ట్రో సైనెస్ ఇన్స్టిట్యూట్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, 300 పడకలతో శ్రీ బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ పేరుతో అడ్వాన్స్ క్యాన్సర్ కేర్ సెంటర్ను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. అనంతరం ప్రతిభచాటిన వివిధ ఫ్యాకల్టీ డాక్టర్లకు డాక్టర సుభాషిణి, డాక్టర్ కమలాకర్ రెడ్డి, ఎండోమెంట్ అవార్డులను, వైద్యవిద్యార్థులను జెసిఎస్ఆర్ బెస్ట్ పేపర్ అవార్డులను డాక్టర్ నీలాప్రసాద్ గోల్డ్ మెడల్, డాక్టర్ వి.శివకుమార్‌కు గోల్డ్‌మెడల్ అవార్డులను అందించారు. అన్యువల్ నెఫ్రాలజీ వ్యాసరచన పోటీలకు సంబంధించి డాక్టర్ కె.వి. దక్షిణమూర్తి గోల్డ్‌మెడల్ అవార్డును, క్విజ్, బెస్ట్‌పేపర్ అండ్ పోస్టర్ కేస్ ప్రజంటేషన్స్ అవార్డులను అందించడంతో పాటు స్విమ్స్ యూనిఫెస్ట్ సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటలపోటీలలో అత్యంత ప్రతిభను చాటిన వివిధ ఫ్యాకల్టీ డాక్టర్లకు ఉద్యోగులకు, విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలను, అవార్డులు అందచేశారు.

## జనమిత్ర ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఛైర్మన్‌కు సన్మానం




**ప్రజాశక్తి- తిరుపతిటౌన్:** జనమిత్ర ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఉద్యోగుల ఆత్మీయ కలయిక తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్కాట్ కష్ణ ప్రసాద్, సుమతిరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జనమిత్ర ఛైర్మన్ శివారెడ్డి ఉద్యోగులను గుర్తించి వారి కుటుంబసభ్యులతో ఆత్మీయ కలయికను ఏర్పాటుచేసి బహుమతులు ఇవ్వడం చాల ఆనందకరం అని అన్నారు. తరువాత లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ జనమిత్ర ఛైర్మన్ శివారెడ్డి సేవాభావం గల వ్యక్తి అని తన వ్యాపారంలో కొంత సొమ్మును పేదప్రజల సేవకోసం వినియోగిస్తారని తెలిపారు. తరువాత సుమతిరెడ్డి మాట్లాడుతూ జనమిత్రతో వ్యాపారం చేసి రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టినవారు 10 రేట్లు రెట్టింపు అయినందుకు సంతోషంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మిమిక్రి విజయ కుమార్, శేషగిరి, నామా రాజేష్, దొరస్వామి రాజు, చరణ్, మరియు జనమిత్ర ఉద్యోగులు రమేష్, చంద్రశేఖర్‌రెడ్డి, మనోహర్రెడ్డి, రవీంద్ర, హనుమంత్‌నాయక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా

● తిరుపతి రూరల్‌లో లోకేష్ పాదయాత్ర ● తనపల్లి లెవల్‌కాజ్‌వే పరిశీలన



లోకేష్‌కు సమస్యల గురించి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు



**ప్రజాశక్తి- తిరుపతి సిటి :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో నిర్వహిస్తున్న పాదయాత్ర ఆదివారం తిరుపతి రూరల్‌లో కొనసాగింది. తిరుచానూరులోని అయ్యప్ప ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బస కేంద్రం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర తిరుచానూరు, వసుందరనగర్, తనపల్లి, భాగ్యనగరం, కూపుచంద్రపేట, దుర్గ సముద్రం, అడపారెడ్డిపల్లి, శివగిరి వద్ద ఏర్పాటు చేసిన బస కేంద్రం వరకు సాగింది. ఆదివారం ఉదయం పాదయాత్ర ప్రారంభించిన 10నిమిషాల తర్వాత తిరుచానూరు అమ్మవారిని దర్శించుకున్నారు. అదే పంచాయతీలో ప్రజలతో ముఖాముఖి, వసుందర నగర్ వాసులతో మాటామంతి, తనపల్లిలో రైతులతో సమావేశం, భాగ్యనగరంలో భోజన విరామం, అనంతరం అక్కడే బిసి సామాజికవర్గాలతో సమావేశంలో కూపుచంద్రపేటలో, దుర్గసముద్రం వద్ద, అడపారెడ్డిపల్లి వద్ద స్థానికులతో మాటామంతి అనంతరం శివగిరి బస కేంద్రానికి చేరుకున్నారు. పాదయాత్రలో భాగంగా తనపల్లిలో ఇటీవల కొట్టుకపోయిన లెవల్‌కాజ్‌వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమర్థ వైసిపి పాలన, అవగాహనలేని సిఎం జగన్ వల్ల నేడు రాష్ట్రానికి ఈ దుస్థితి వచ్చిందన్నారు. వర్షాకాలంలో కనీస అంచనాలు లేకుండా జగన్ ప్యాలస్‌లో పడుకోవడం వల్ల అన్నమయ్య డ్యాం కొట్టుకపోయిందని, 60 మందిని జగన్ పొట్టనపెట్టుకున్నారని విమర్శించారు. నీటి నిర్వాహణలో జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. స్వర్ణముఖి నదిపై ఉన్న 7లో లెవల్ కాజ్‌వేలు వరదల్లో దెబ్బతిన్నాయని, తాత్కాలికంగా మట్టి, పైపులు వేసి జగన్ ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. వీటి వలన ప్రజలకు ప్రమాదం పొంది ఉందన్నారు, చిన్న వర్షం వచ్చిన కొట్టుకపోయే ప్రమాదం ఉందన్నారు. కాజ్‌వేలు కొట్టుకుపోయి ఏడాది అవుతున్న ప్రభుత్వం శాశ్వత పరిస్కారానికి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యని శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, పులివర్తి నాని, మాజీ ఎంఎల్ఏ సుగుణమ్మ, ఈశ్వర్‌రెడ్డి, పి.మోహన్, పులివర్తి వినిల్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**న్యాయమైన డిమాండ్లకు పరిష్కారం**

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని నారా లోకేష్ ప్రకటించారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర 28వ రోజు ఆదివారం తిరుపతి రూరల్, రామచంద్రపురం మండలంలో సాగింది. ఈ సందర్భంగా కొన్ని ఉపాధ్యాయ సంఘాలు నారా లోకేష్ కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వివరించారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేయడాన్ని రద్దుచేయాలి విన్నవించారు. ఉపాధ్యాయ బదిలీలకు స్పష్టమైన శాశ్వత విధివిధానాలను రూపొందించాలని చెప్పారు. ప్రతినెలా 1వ తేదీన జీతాలు వచ్చేటట్లు చట్టం చేయాలని కోరారు. అలాగే ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని రద్దుపరచి బయోమెట్రిక్ విధానాన్ని అమలు పరచాలని, యాప్ భారాన్ని తగ్గించి వాటిని సచివాలయ ఉద్యోగులకు అనుసంధానం చేయాలని కోరారు. లోకేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను ఇదివరకెన్నడూ లేనివిధంగా వేధింపులకు గురిచేస్తున్న రాక్షసుడు జగన్ రెడ్డి అన్నారు. పవిత్రమైన వత్తిలో ఉన్న గురువులతో మందుషాపులవద్ద కాపలా పెట్టిన నీచుడు ఈ ముఖ్యమంత్రి అని దూషించాడు. తమ హక్కుల కోసం న్యాయపోరాటం చేస్తున్న టీచర్లపై ఉగ్రవాదుల మాదిరిగా తప్పుడు కేసులుపెట్టి వేధించిన ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేదని చెప్పారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామన్నారు. టీచర్లు ఎటువంటి వేధింపులు లేకుండా స్వేచ్ఛగా పనిచేసుకునే వాతావరణం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**లోకేష్ బస ముందు వైసిపి నిరసన**

తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర బస కేంద్రం వద్ద వైసిపి నాయకులు ఆదివారం నిరసనకు దిగారు. నారా లోకేష్ పాదయాత్ర శనివారం తిరుపతి అర్బన్ నుంచి రాత్రి తిరుపతి రూరల్‌లోని తిరుచానూరు వద్దనున్న అయ్యప్ప ఆలయం వద్ద వరకు సాగింది. అనంతరం ఆయన అక్కడే ఏర్పాటు చేసిన కేంద్రంలో బస చేశారు. శనివారం పాదయాత్రలో తిరుపతి ఎంఎల్ఏ భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన తనయడు భూమన అభినయ్‌రెడ్డిని ఉద్దేశించి నారా లోకేష్ తిరుపతికి ఇద్దరు ఎంఎల్ఏలు అని ఎద్దేవా చేసిన విషయం విధితమే. ఈ మాటలను వ్యతిరేకిస్తూ వైసిపి యువజన నాయకులు పెద్దఎత్తున లోకేష్ బస చేసే ప్రాంతానికి చేరుకుని, ఆయన బస చేస్తున్న ఏసి కంటైనర్ వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వైసిపి యువజన నాయకులు బాలిశెట్టి కిషోర్ మాట్లాడుతూ విలాసవంతమైన సూపర్‌లగ్జరి ఎయిర్ కండీషనర్ కంటైనర్‌లో విశ్రాంతి తీసుకుంటున్న లోకేష్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. తిరుపతి అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదని విమర్శించారు. పబ్లిసిటీ కోసం ఎంఎల్ఏ, ఆయన కుమారుడుపై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు లోకేష్ రెండో సిఎంగా వ్యవహరించారని ఎద్దువా చేశారు. అందరూ అలాగే వ్యవహరిస్తారనుకోవడం వారి అవివేకమన్నారు. అనంతరం పోలీసులు వారికి సర్దిచెప్పి అక్కడ నుంచి పంపివేశారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ వంశీ, వాసుయాదవ్, ఇరగం అనిల్‌రెడ్డి, మద్దాలి శేఖర్‌రాయల్, మైలం శ్రీకాంత్‌రెడ్డి, సూరి, సుభాష్, ప్రదీఫ్, చందు, గోవర్ధన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### లోకేష్ యువగళం పాదయాత్ర వివరాలు

ఇప్పటి వరకు నడిచిన దూరం కి.మీ. 367.3 కి.మీ.
28వ రోజు ఆదివారం నడిచిన దూరం -13.2 కి.మీ.

**యువగళం పాదయాత్ర 29వ రోజు షెడ్యూల్ (27-2-2023)**

**చంద్రగిరి నియోజకవర్గం:**

ఉదయం 8 గంటలకు చంద్రగిరి మండలం శివగిరి విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభం. 9.15గంటలకు శానంబట్ల గ్రామంలో స్థానికులతో మాటామంతీ, 10.20 గంటకలు పిచ్చినాయుడుపల్లిలో ఎస్సీ సామాజికవర్గీయులతో సమావేశం. 10.45 గంటలకు తొండవాడ బహిరంగసభలో యువనేత ప్రసంగం. 11.45 గంటలకు తొండవాడలో భోజన విరామం. 12.45 గంటలకు భోజనవిరామ ప్రాంతంలో స్థానికనేతలతో అంతర్గత సమావేశం.

సాయంత్రం 3గంటలకు తొండవాడనుంచి పాదయాత్ర కొనసాగింపు. 4.30 గంటలకు చంద్రగిరి టవర్ క్లాక్ జంక్షన్ లో స్థానికులతో మాటామంతీ. 5.05 గంటలకు చంద్రగిరి నూర్ జంక్షన్‌లో స్థానికులతో భేటీ. 6.55 గంటలకు ఇత్తెపల్లిలో స్థానికులతో మాటామంతీ. 7.45 గంటలకు మామందూరు విడిది కేంద్రంలో బస.

## శ్రీ చైతన్యలో ఘనంగా స్పోర్ట్స్ డే



**ప్రజాశక్తి-తిరుపతి మంగళం:** తిరుపతిలోని శ్రీ చైతన్య స్కూల్ ఐపీఎల్ బ్రాంచ్‌లో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ఆదివారం స్పోర్ట్స్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నపూర్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని.. ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే చదువులోనూ ముందంజలో ఉంటారని ఎలిపారు, ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు గేమ్స్ నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపల్ అన్నపూర్ణ మెడల్స్, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా ఏజీఎం సురేష్ విచ్చేసి విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏవో రవిబాబు, డీన్ శివరాజు, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి మంజుల, పీఈటీ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పుత్తూరులో కుక్కల బెడద



**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** పుత్తూరు పట్టణంలో కుక్కల బెడద అధికమైంది. కుక్కలు గుంపులు గుంపులుగా స్వైరవిహారం చేస్తూ ప్రజలపై దాడి చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో రోడ్లపై ప్రయాణించాలంటే పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వీధి కుక్కలకు స్టెరిలైజేషన్, వీధి కుక్కల సంరక్షణ, వాటి నియంత్రణకు మున్సిపాలిటీ, పశు సంవర్ధక శాఖ, (అనిమల్ బర్త్ కంట్రోల్) బాధ్యతగా ఉండాలి. వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ నిర్వహించి యాంటీ రాబీస్ టీకాలు వేస్తారు. ఇకనైనా ఇలాంటి ప్రక్రియలు నిర్వహించి కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రవికుమార్ సేవలు అభినందనీయం



**ప్రజాశక్తి-గూడూరు రూరల్:** పేదలకు నిస్వార్థంగా సేవలు చేస్తున్న లయన్స్ క్లబ్ గవర్నర్ బయ్య రవికుమార్ సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిరంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ రవి కుమార్ తల్లి బయ్య సరోజనమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని అన్ని లయన్స్ క్లబ్‌లతో వారి సొంత నిధులతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఆయన తల్లి కిడ్నీ వ్యాధితో మతిచెందడంతో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాల లోని డయాలసిస్ సెంటర్‌కు రూ.25 లక్షలు విరాళం అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కళ్యాణ సాయి, డిస్ట్రిక్ట్ ఛైర్మన్ వాకాటి రామ్మోహన్, మల్లెమాల మురళీరెడ్డి, శీనయ్య, రూపేష్ రెడ్డి, రవిచంద్రారెడ్డి, రాధాకష్ణ, ఇక్కా శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## కంపా జయలక్ష్మికి డాక్టరేట్ ప్రదానం

**ప్రజాశక్తి-క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఆర్థికశాస్త్ర పరిశోధకురాలు కంపా జయలక్ష్మికి డాక్టర్ డిగ్రీని ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎం.దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె వర్సిటీలోని సౌత్ ఈస్ట్ ఏసియన్ పసిఫిక్ స్టడీస్ విభాగానికి చెందిన డాక్టర్ వి.రమేష్ బాబు పర్యవేక్షణలో " ఫారిన్ ట్రేడ్ రిలేషన్స్ బిట్వీన్ ఇండియా అండ్ జపాన్ – యాన్



అనలైటికల్ స్టడీ " అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఆమె పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధన వ్యాసాలను ప్రచురించినట్లు తెలిపారు. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పాల్గొని అనేక పరిశోధనా వ్యాసాలను సమర్పించారు. కంప జయలక్ష్మికి డాక్టర్ అవార్డు రావడంపై పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

## కోసలనగరం ప్రజలకు అందుబాటులో ఉంటా..!



**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** కోసలనగరం ప్రజలకు సమస్యలు లేకుండా నిరంతరం అందుబాటులో ఉంటామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరులు కుమారస్వామిరెడ్డి అన్నారు. ఆదివారం కోసలనగరం గ్రామంలో ఆయన వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలు ఎవరూ నమ్మకండని.. తాము ఎప్పుడు అందుబాటులో ఉంటూ కార్యకర్తలు , ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రభుత్వాన్ని..రోజమ్మ రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, మండల కమిటీ సభ్యులు, కో ఆప్షన్ మెంబర్లు , మార్కెట్ కమిటీ ఛైర్మెన్, డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువశ్రీ మురళీకి సత్కారం



**ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ:** కల్లిబెట్టు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న యువశ్రీ మురళీని తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఘనంగా సత్కరించారు. విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆముదాల మురళి శతావధానంలో దత్తపది, వర్ణన అంశాలపై పచ్ఛకులుగా వ్యవహరించినందుకు రచయిత, తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళిని శతావధాన సంచాలకులు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, ఐ.ఏ.ఎస్.అధికారి నక్కల ప్రభాకర రెడ్డి, సాకం నాగరాజు తదితరులు సత్కరించారు.

# ప్రణాళిక + కృషి = విజయం

- 'పది'లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ
- ఏప్రిల్ 3 నుంచి పబ్లిక్ పరీక్షలు

**విద్యార్థులకు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సాధించే మార్కులే ఉన్నత విద్యకు తొలి మెట్టు. దీన్ని దష్టిలో ఉంచుకుని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో గత ఏడాది కంటే ఈ ఏడాదిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఉపాధ్యాయులు విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా నైపుణ్యాన్ని పెంచి ఉత్తీర్ణత శాతాన్ని పెంచే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. ఉత్తమ ఫలితాలతో పాటు అత్యధిక మార్కులు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కషి చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులతో పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులు సైతం చదువుల్లో తమ ప్రతిభను చూపేందుకు కృషి చేస్తున్నారు.**



**ప్రజాశక్తి - ఓజిలి**

ఓజిలి మండలంలో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు , ఏకలవ్య , గురుకుల పాఠశాలలు ఉండగా.. ఇందులో ఈ ఏడాది 331 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. పరీక్షల సయయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మంచి మార్కులు సాధించేలా ముందుగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజుకొకరు చొప్పున రోజూ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటికి వెళ్లి విద్యార్థులు చదువుతున్నారా.. టీవీలు, సెల్ ఫోన్లు చూస్తున్నారా అన్న అంశాలపై పరిశీలన చేస్తున్నారు. తల్లిదండ్రులకు తమ పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అవగాహన కల్పిస్తున్నారు.

**ఫలితాల దిశగా ప్రత్యేక తరగతులు**

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల కొనసాగుతున్నాయి. ఉదయం 8.30 నుంచి 9.30 వరకు, సాయంత్రం 4.45 నుంచి 5.50 గంటల వరకు రోజూ సబ్జెక్టు వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్, రోజూ స్లిప్ టెస్టులను ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించి పరీక్షల నాటికి తోటి విద్యార్థులతో సమాన మార్కులు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. ఉదయం ఓ సబ్జెక్ట్, సాయంత్రం మరో సబ్జెక్టుపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం సాధించడానికి ఉపాధ్యాయులు శాయశక్తుల కృషి చేస్తున్నారు.

### రోజూ మోడల్ పరీక్షలు



రోజూ ప్రత్యేక తరగతుల్లో అన్ని పాఠ్యాంశాలకు సంబంధించి రివిజన్ పరీక్షలు పెడుతున్నారు. మరుసటి రోజు రివిజన్ పరీక్షల్లో ఉన్న తప్పులను మాతో సరి చేయిస్తున్నారు. ఉపాధ్యాయులు మాకున్న అనుమానాలపై ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. పబ్లిక్ పరీక్షలను సకాలంలో సమగ్రంగా రాయడానికి మాకు దోహద పడుతుందని భావిస్తున్నాను.

**- కార్తీక్, విద్యార్థి, పదో తరగతి**

### ప్రత్యేక తరగతులతో మేలు



రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో మాకు ఎంతగానో మేలు జరుగుతోంది. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలనే పట్టుదలతో చదువుతున్నాను. ఇంగ్లీష్, గణితం, సైన్స్‌తోపాటు అన్ని సబ్జెక్టులు శ్రద్ధగా ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. పదే పదే మోడల్ పరీక్షలు పెడుతున్నారు. దీంతో మాకు పరీక్షలంటే భయం పోయింది. మేము పదిలో అత్యధిక మార్కులు తెచ్చుకోవడానికి ఎంతో ఇష్టపడి చదువుతున్నాం.

**- కె.సౌమ్య, విద్యార్థిని, పదో తరగతి**

### గణితం అంటే భయం పోగొడుతున్నాం



విద్యార్థులకు గణితం అంటేనే ఆ పాఠ్యాంశం కష్టమని.. చదవలేమని భయపడుతుంటారు. అలాంటి వారిలో గణితమంటే ఉన్న భయాన్ని తొలగించి.. దష్టి పెడితే లెక్కలు సులువైన పాఠ్యాంశం అనేలా విద్యార్థులకు అవగాహన కల్పించాం. గణితంలో వివిధ ప్రశ్నలతో వారికి శిక్షణ ఇస్తున్నాం. సమయాన్ని కచ్చితత్వాన్ని సరిచూసుకుంటూ పరీక్షలు రాయాలని సూచిస్తున్నాం.

**- ఎస్.శరత్ కుమార్, గణిత ఉపాధ్యాయులు, ఓజిలి**

### పది ఫలితాలే లక్ష్యంగా పర్యవేక్షిస్తున్నాం



ప్రతి హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్నాం. జిల్లా విద్యాశాఖ ఇచ్చిన 60 రోజుల కార్యాచరణను అమలు చేస్తున్నాం. పదో తరగతి విద్యార్థులను ఏ,బీ,సీ,డీలుగా విభజించి వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేస్తున్నాం.

**- జి.శైలజ, మండల విద్యాశాఖ అధికారిణి, ఓజిలి**

## ఘనంగా అమర హాస్పిటల్ వార్షికోత్సవం

**ప్రజాశక్తి-రేణిగుంట:** రేణిగుంట కరకంబాడి అమర హాస్పిటల్‌లో ఆదివారం ద్వితీయ వార్షికోత్సవ సంబరాలు జరిగాయి. ముఖ్యఅతిథిగా ఎంపీ గల్లా జయదేవ్ పాల్గొని మాట్లాడుతూ ద్వితీయ వార్షికోత్సవంలో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని.. అమర హాస్పిటల్ ఎండీ గౌరనేని రమాదేవి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత ఆశయాలతో ఈ హాస్పిటల్ మొదలై నేటికి రెండో వార్షికోత్సవం జరుపుకోవడం అభినందనీయమన్నారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలికే పరిమితమైన వైద్య సదుపాయం ఇప్పుడు తిరుపతి పట్టణంలో అమర హాస్పిటల్లో అత్యధిక వైద్య సదుపాయం కల్పిస్తున్నందుకు సంతోషం తెలిపారు. ఎండీ రమాదేవి మాట్లాడుతూ వైద్యులు నాణ్యత ప్రమాణాలను పాటించి ఆసుపత్రిలో పనిచేస్తున్న వారందరూ కుటుంబ సభ్యులుగా ఉండి సేవలందించాని




కోరారు. తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయన్నారు. ఆటల పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. అమర హాస్పిటల్ ఛైర్మన్ గౌరనేని ప్రసాద్, సీఈవో వేణుగోపాల్ , అడ్మిన్ శ్రీధర్, డాక్టర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాశక్తి -దొరవారిసత్రం:** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై జేఏసీ ఛైర్మన్ పెళ్లూరు గోపీనాథ్‌రెడ్డి ఆదివారం విజయవాడలో జరిగిన అమరావతి జేఏసీ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వివరించారు. రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దష్టికి తీసుకురావాలని సమస్యలపై చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్, ప్రధాన కార్యదర్శి దామోదరం అసోసియేట్ ప్రెసిడెంట్ రాజు, కార్యవర్గ సభ్యులు



పాల్గొన్నట్లు ఆయన గోపీనాథ్‌రెడ్డి తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణ కోరుతూ పాదయాత్ర ప్రారంభం

**ప్రజాశక్తి -సత్యవేడు:** ఎస్సీ వర్గీకరణలో బీజేపీ చేసిన మోసాన్ని గ్రామాల్లో ఎండగడుతూ మార్చి 15వ తారీకు విజయవాడ బీజేపీ కార్యాలయం ముట్టడి చేయడంలో భాగంగా ఆదివారం ఎంఎస్‌పీ చిత్తూరు జిల్లా కో కోర్డినేటర్ నరేంద్రబాబు సత్యవేడులో పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి సూరిపాక వాసుదేవరావు, నియోజకవర్గ కో కన్వీనర్ సుధాకర్, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కోకన్వీనర్ రాఘవయ్య, ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు వేలూరు రాజేంద్ర, సత్యవేడు నియోజకవర్గ కన్వీనర్ చిన్న రాఘవయ్య, జానకిరామ్, సాయికుమార్, దొరబాబు, అయ్యప్ప,




మునివేలు, జనార్ధన్, నరేష్, వెంకటేష్, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జేసీఎస్ మండల కన్వీనర్ల నియామకం

**ప్రజాశక్తి - క్యాంపస్**

చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు జగనన్న సచివాలయం, గృహసారథుల (జేసీఎస్) కన్వీనర్లుగా ఆరుగురిని నియమించారు. చంద్రగిరి మండలానికి సి.మునికేశవులు (బుజ్జి), చిన్నగొట్టిగల్లుకు ఖాదర్ అహ్మద్, పాకాల మండలానికి నంగా బాబురెడ్డి, రామచంద్రాపురాని పి.రమేష్‌రెడ్డి, ఎర్రావారిపాళెంకు చెంగల్ రెడ్డి, తిరుపతి రూరల్ మండలానికి కొత్తపాటి మునీశ్వర్ రెడ్డిలను నియమించినట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు మండలాల్లో నియమితులైన జేసీఎస్ మండల కన్వీనర్లు జగనన్న సచివాలయం కన్వీనర్లు, గృహసారథుల మధ్య సమన్వయం చేసుకుని పార్టీ పటిష్టతకు కృషి చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామ స్థాయిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు అధినేత జగనన్న ఇచ్చిన ఆదేశాల మేరకు కన్వీనర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన జగనన్న పట్ల ప్రజల్లో అభిమానం ఏ మాత్రం తగ్గలేదని.. దానికి అనుగుణంగా జగనన్న గృహసారథులు, కన్వీనర్లు పార్టీ అభ్యున్నతికి పనిచేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి సూచించారు.

## ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** తిరుపతి అర్బన్ మండలం మంగళం పరిధిలోని మంగళం గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబర్ 53/2లోని 5 ఎకరాల భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంటున్నట్లు తిరుపతి అర్బన్ తాహశీల్దార్ వెంకటరమణ ఆదేశాలతో వీఆర్వోలు భూపతి ఆచారి, సుమన్ కలిసి గ్రామంలో దండోరా వేయించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. సిసిఎల్‌ఏ కమీషనర్ కోర్టు




(అపీల్స్)లో గత 2006 నుండి సదరు సర్వే నెంబర్‌లోని 5 ఎకరాలపై విచారణలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2023 జనవరి 3వ తేదీ సర్వే నెంబర్ 53/2లోని 5 ఎకరాలను ప్రభుత్వ ఆధీనం లోకి తీసుకోవాలని సిసిఎల్‌ఏ కమీషనర్ కోర్టు (అపీల్స్) వారు ఉత్తర్వులు ఇచ్చారని వీఆర్వోలు తెలిపారు. ఈ భూమిలో ఎటువంటి ఆక్రమణలు చేసినా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## తిరుపతి అభివృద్ధికి భూమన నిరంతర శ్రమ



**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** యువగళం పేరుతో నారా లోకేష్ ఆంధ్ర రాష్ట్రంలో జరిగే అభివృద్ధిని వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, అందులో భాగంగానే తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక భూమన కుటుంబంపై విమర్శలు చేస్తున్నారని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ అన్నారు. ఆదివారం కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ తిరుపతి ప్రెస్ క్లబ్ లో వేరువేరుగా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారా లోకేష్ తిరుపతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డిపై, డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డిపై విమర్శలు చేశారన్నారు. తిరుపతిలో గత 30 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా అభివద్ధి కార్యక్రమాలు వైసీపీ ప్రభుత్వ హయంలో ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి సారథ్యంలో శరవేగంగా జరుగుతుంటే దాన్ని విమర్శిసున్నారన్నారు. వైసిపి జిల్లా యువజన అధ్యక్షులు అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉక్కు సంకల్పం కలిగిన వ్యక్తులు సమాజానికి అవసరమన్న వివేకానందుని మాటలను అనుసరించి తిరుపతి అభివృద్ధి కోసం ఉక్కు సంకల్పంతో పనిచేసే అభినవ వివేకానందుడుగా అభినయరెడ్డి పని చేస్తున్నారని, చేస్తున్న అభివృద్ధిపై విష ప్రచారాలు మానుకోకపోతే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు హనుమంత నాయక్, రామస్వామి వేంకటేశ్వర్లు, దూది కుమారి, పొన్నాల చంద్ర, కుడితి సుబ్రమణ్యం, సూరి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుడి మృతికి నివాళులు

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** రామ సముద్రం పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు ఆర్.సుధాకర్‌నాయుడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. దీంతో టీడీపీ



నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ రామసముద్రం చేరుకొని భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యంనాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి లోకేష్ మాట్లాడాలి



**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** స్థానికత గురించి నారా లోకేష్‌కు మాట్లాడే అర్హత లేదని తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ ఆర్.శిరీష అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో ఉంటూ రాజకీయాలు చేసే కుటుంబానికి చెందిన నారా లోకేష్ తిరుపతి సమీపంలోని రేణిగుంటలో పుట్టి, తిరుపతిలో విద్యాభ్యాసం చేసి, తిరుపతి శాసనసభ్యులుగా ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి స్థానికత గురించి విమర్శించే హక్కు, అర్హత లోకేష్ కు లేదన్నారు. పాదయాత్ర చేసిన వారందరికీ అధికారం చేపట్టడం సాధ్యం కాదని, ఈ విషయం చవి చూసిన చంద్రబాబునాయుడు అయినా లోకేష్ కు చెప్పి ఉండాలన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి గతంలో చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రకు అనేక ఆంక్షలు విధించారని, అయితే ఆనాడు ఆంక్షల వల్ల ఇబ్బందులకు గురి అవుతున్నా, ప్రజల కోసం భరిస్తూ ఏనాడు తనను అధికార పార్టీ వాళ్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని జగన్మోహన్ రెడ్డి చెప్పలేదన్నారు. తిరుపతి నగరాన్ని సాంస్కతిక నగరంగా ఆధ్యాత్మిక శోభతో అభివద్ధి బాటలో నడిపిస్తున్న భూమన కరుణాకర్ రెడ్డి, భూమన అభినయ రెడ్డిలపై విమర్శలు చేయడం శోచనీయమన్నారు. తిరుపతి నగరంలో జరుగుతున్న అభివద్ధి కార్యక్రమాలను పక్కనపెట్టి, స్థానిక టిడిపి నేతలు ఇచ్చిన స్క్రిప్టులను లోకేష్ చదువుతున్నారని ఎద్దేవా చేశారు. తిరుపతి ప్రాంతంలో జరుగుతున్న అభివద్ధి కార్యక్రమాలను చూసి మాట్లాడాలని హితవు పలికారు. వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు తగిన ప్రాధాన్యమిస్తారని ఎందుకు నిదర్శనమే నగరపాలక సంస్థలు 27 మంది మహిళా కార్పొరేటర్లుగా ఎన్నుకోబడ్డామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాధా, శ్రావణి, ఆదిలక్ష్మి, ఉమా యాదవ్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## మహిళ కిడ్నాప్ కలకలం

**ప్రజాశక్తి-రేణిగుంట:** తూకివాకం పంచాయతీ పరిధిలోని ఏఎన్ఆర్ కాలనీ నివాసముంటున్న రవిచంద్ర సతీమణి పార్వతిని ఆదివారం కొందరు దాడి చేసి దౌర్జన్యంగా కిడ్నాప్ చేశారు. వివరాలిలా.. ఏఎన్ఆర్ కాలనీ చెందిన రవిచంద్ర రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. పాత కక్షల నేపథ్యంలో శ్రీకాళహస్తి వీఎమ్‌పల్లికి చెందిన కూలి మస్తాన్, కూలిరాజమ్మ, కూలి ధనలక్ష్మి, సాయి కుమార్ మరో ఇద్దరు వ్యక్తులు ఏఎన్ఆర్ కాలనీలోకి ప్రవేశించి రవిచంద్ర ఇంటిపై దాడి చేశారు. ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేసి ఇంట్లోని పార్వతిపై దాడి చేసి ఆటోలో కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. ఏఎన్ఆర్ కాలనీ ప్రజలందరూ చూస్తుండగానే దౌర్జన్యంగా మహిళను తీసుకెళ్లడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. రవిచంద్ర గాజులమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాజులమండ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యోదా డయోగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలు



**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** తిరుపతి నగరంలోని యోదా డయోగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీలో ఉచిత రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఎం ఉమామహేశ్వరి మాట్లాడుతూ యోదా డయోగ్నస్టిక్స్‌తో కేవలం రూ.999 లకు 43 రకాల టెస్టులను నిర్వహిస్తున్నామన్నారు. స్థానికంగా ఉన్న వారు, తిరుపతి నగర పరిధిలో నివాసమున్న వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఆదివారం మధ్య తరగతి ప్రజలు నివాసముండే ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన విభాగం సిబ్బంది ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సెక్షన్ ఆఫీసర్ పరీక్షల్లో ప్రథమ స్థానం

**ప్రజాశక్తి- తొట్టంబేడు:** హైకోర్టు నిర్వహించిన సెక్షన్ ఆఫీసర్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో ఎంపికైన తొట్టంబేడు మండలం తొట్టంబేడు పంచాయతీ బంగారమ్మ కాలనీకి చెందిన చేతన్ దీపక్‌కు సీనియర్ పంచాయతీ కార్యదర్శి ఆనందబాబు అభినందనలు తెలియజేశారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బంగార్మ గుడి దగ్గర నివాసం ఉన్న రాధా త్యాగరాజుల కుమారుడు చేతన్ దీపక్ ఇటీవల రాష్ట్రస్థాయిలో హైకోర్టు జరిపిన సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు రాష్ట్ర ప్రథమ స్థాయిలో ఎంపిక అయ్యారని ఉమ్మడి రాయలసీమ పంచాయతీ రాజ్ సర్వీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కందుకూరి ఆనందబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇతను ప్రస్తుతం శ్రీకాళహస్తి మండలం అరవ కొత్తూరు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్నారు. శ్రీకాళహస్తి వివేకానంద స్కూల్ పూర్వ విద్యార్థులు అరవకొత్తూరు సచివాలయం సిబ్బంది అభినందనలు తెలియజేశారు.